# 'ప్రజావాణి'తో సత్వర పరిష్కారం

జిల్లా పరిషత్, న్యూస్‌లైన్

ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై సత్వరం స్పందించి నాణ్యమైన సేవలు అందించేందుకు 'ప్రజా వాణి' పేరుతో సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ బి. వెంకటేశం ప్రకటించారు. జూన్ 1 నుంచి ప్రజలు ఆన్‌లైన్‌లో ఆర్జీలు అందజేసే వెసులుబాటును కల్పిస్తున్నట్లు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో మంగళ వారం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ ప్రజావాణి విధివిధానాలను వివరించారు.




ప్రజావాణి వెబ్‌సైట్ గురించి అధికారులకు వివరిస్తున్న కలెక్టర్ వెంకటేశం

### ఆర్ఎస్‌డిపి, ఇ సేవా కేంద్రాల ద్వారా అర్జీలు...

అర్జీదారులు కలెక్టర్ కార్యాలయానికి రాకుండా నేరుగా ఇ సేవా కేంద్రాలు, గ్రామీణ సేవల డెలివరీ పాయింట్ల ద్వారా తమ అర్జీలు పంపే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ సేవ లను అందజేస్తున్నట్లు చెప్పారు. ఏ కేంద్రంలో అయితే ప్రజలు అర్జీ ఇచ్చారో అదే కేంద్రానికి వెళ్ళి ఏంజరిగింది తెలుసుకోవచ్చన్నారు. ప్రతి రోజూ ఏ శాఖ ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించిందీ తేలికగా తెలిసిపోతుందన్నారు.

### ప్రతి అర్జీకి రూ.20 రుసుం...

ప్రతి అర్జీదారుడు రూ.20 చెల్లించి ఫిర్యాదులు ఆయా కార్యాలయాలకు పంపించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే విక లాంగులకు, వితంతువులకు మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో రూ.5 సదరు సేవా కేంద్రానికి వెళతాయన్నారు. మొత్తం 10 మున్సిపాలిటీలలో 18 ఇ సేవా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలలో 54 సర్వీస్ డెలివరీ పాయింట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వారం రోజుల తర్వాత దరఖాస్తుదారునకు సమాధానం ఇవ్వని ఎడల రోజుకు రూ. 25 వంతున నష్టపరి హారాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్లెక్సీ బోర్డుల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పిస్తామని కలెక్టర్ స్పష్టీకరించారు. ఈ ప్రయత్నానికి ప్రయోజనం చేకూరేలా అధికారులు సమర్ధవంతంగా పనిచే సి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా వికలాంగ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ సూర్యనారాయణ వ్యవహరిస్తారని తెలిపారు.